క్లుప్తంగా

రేపు ఉచిత వైద్యశిబిరం

రాయచోటి అర్బన్ : ఈనెల 16వ తేదీన రాయచోటి పట్టణంలో ఉచిత న్యూరో వైద్య శిబిరాన్నినిర్వహిస్తున్నట్లు తిరుపతికి చెందిన వైద్యురాలు వినూత్న ప్రసాద్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అడ్వాన్స్‌డ్ న్యూరో అండ్ స్పైన్ సెంటర్ ఆధ్వర్యంలో ఈ ఉచిత వైద్య శిబిరం నిర్వహింపబడుతుందని ఆమె పేర్కొన్నారు. పట్టణంలోని బోస్‌నగర్‌లోని సీఎస్ రాజు హైస్కూల్ ఆవరణలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు శిబిరం ఉంటుందని తెలియజేశారు. తక్కువ ధరకే రక్త పరీక్షల నిర్వహణతోపాటు చికిత్సలు పొందిన రోగులందరికి ఉచితంగా మందుల పంపిణీ చేయబడతాయంటూ తెలిపారు.

బాధ్యతల స్వీకరణ


బీవీ చలపతి, సీఐ, రాయచోటి అర్బన్

రాయచోటి టౌన్ : రాయచోటి అర్బన్ సీఐగా బివి చలపతి బాధ్యతలు చేపట్టారు. గురువారం ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈయన స్థానంలో పని చేసిన చంద్రశేఖర్ శ్రీ భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాలలో చివరి రోజైన స్వామి వారి పారువేట నిర్వహణలో జరిగిన గొడవలు నియంత్రించలేకపోయాడనే ఆరోపణలు రావడంతో వీఆర్‌కు వెళ్లారు. ఆయన స్థానంలో బీవీ చలపతి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయచోటి శాంతి భద్రతలు కాపాడేందుకు తనవంతు కృషి చేస్తానని, ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన అలాంటి వారు ఎలాంటి వారిని కఠినంగా శిక్షిస్తామని హెచ్చరించారు.

వైభవంగా కల్యాణ వేడుక


విశేష పూజలందుకున్న స్వామి, అమ్మవార్లు

సంబేపల్లె : మండల పరిధిలోని నారాయణరెడ్డిపల్లె గ్రామం చిత్తూరు – కర్నూలు జాతీయ రహదారి సమీపంలో కొలువైన శ్రీ లక్ష్మీనరసింహ స్వామి కల్యాణమహోత్సవం శుక్రవారం అంగరంగ వైభవంగా జరిగింది. పౌర్ణమి సందర్భంగా ఆలయాన్ని పూలు, విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. అనంతరం వేదపండితులచే శ్రీలక్ష్మీ దేవి సమేత నరసింహస్వామి కల్యాణాన్ని నిర్వహించారు. మూలవిరాట్‌లకు అర్చన, అభిషేక తదితర పూజ క్రతువులను శాస్త్రోక్తంగా జరిపారు. అనంతరం వచ్చిన భక్తులకు అన్నదాన వితరణ చేశారు. స్వామి వారిని దర్శించుకొనేందుకు భక్తులు పెద్ద సంఖ్య హాజరైయ్యారు.

జాతర నిర్వహణకు విరాళం


విరాళం అందజేస్తున్న వైఎస్‌ఆర్‌సీపీ నేతలు

సుండుపల్లె : మండల పరిధిలోని చిన్నగొల్లపల్లె గ్రామ పంచాయతీ పూజారివాండ్లపల్లెలో వెలసిన చింతకుంటమ్మ తిరునాలకు రాజంపేట నియోజకవర్గ వైఎస్‌ఆర్‌సీపీ నాయకుడు గాలివీటి విజయసాగర్‌రెడ్డి (మదన్‌రెడ్డి) రూ.19,500, సర్పంచ్ రామాజయచంద్ర రూ.2,516 నగదును గ్రామ ప్రజలకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలందరూ కలసిమెలసి తిరునాలను జరుపుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆలయ పూజారి నాగరాజ, శ్రీకాంత్, ఆరంరెడ్డి, వీరనాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వరిగ సర్పంచ్ మృతి తీరనిలోటు


మృతదేహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి

రాయచోటి టౌన్ : రాయచోటి రూరల్ పరిధిలోని వరిగ గ్రామ సర్పంచ్ కసిరెడ్డి సుబ్బలక్ష్మమ్మ అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. ఆమె మృతదేహాన్ని వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి సందర్శించి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరిగ సర్పంచ్‌గా సుబ్బలక్ష్మమ్మ గ్రామానికి ఎనలేని సేవలు చేశారని కొనియాడారు. ఆమె కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని తెలియజేశారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

వీధిలైట్లు ఏర్పాటు

వీరబల్లి : మండలంలోని గుర్రప్పగారిపల్లి పంచాయతీలోని గ్రామాలలో సర్పంచ్ ఈశ్వరయ్య ఆధ్వర్యంలో శుక్రవారం వీధిలైట్లు ఏర్పాటు చేశారు. శనివారం వీరనాగమ్మ జాతర కావడంతో ప్రత్యేకంగా గుడిచుట్టూ ఉన్న విద్యుత్ స్తంభాలకు వీధిలైట్లు ఏర్పాటు చేసినట్టు సర్పంచ్ తెలియజేశారు. తమ నిధులతో ఈ వీధిలైట్లు ఏర్పాటు చేయడం జరిగిందని చెప్పారు. కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు మదన్‌మోహన్‌నాయుడు, చక్రే నాయక్, సుబ్బరామరాజు, శ్రీరాములు రెడ్డి, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

కృషి అమోఘం.. కల సాకారం

- ముగింపు దశకు చేరుకుంటున్న ఆర్‌యూబీ పనులు
- రూ.72 కోట్ల నిధులతో 9 ఆర్‌యూబీల నిర్మాణం
- చొరవచూపిన ఎంపీ పీవీ మిథున్‌రెడ్డి, అప్పటి ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు
- నెరవేరనున్న ప్రజలు, విద్యార్థుల దశాబ్దాల కల


బంగ్లా మిట్ట వద్ద పూర్తయిన అండర్‌బ్రిడ్జి


కోడూరు పట్టణంలో పూర్తి కానున్న డబుల్ వే అండర్ బ్రిడ్జి


ఆర్‌యూబీ పనులు ప్రారంభిస్తున్న ఎంపీ మిథున్‌రెడ్డి, అప్పటి ఎమ్మెల్యే కొరముట్ల (ఫైల్)

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు మండలంలోని రైల్వేస్టేషన్ వద్ద రైల్వే అండర్ బ్రిడ్జి (ఆర్‌యూబీ) లేక ఏళ్లుగా ప్రజలు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఎన్ని ప్రభుత్వాలు వచ్చినా, ఎంత మంది ప్రజాప్రతినిధులు ఉన్నా రాష్ట్ర స్థాయిలో చక్రం తిప్పే నాయకులు ఉన్నప్పటికీ రైల్వేకోడూరు అండర్ బ్రిడ్జిని ఏ ఒక్కరూ మంజూరు చేయించలేక ప్రజల కష్టాలు వర్ణాతీతంగా మారాయి. ప్రభుత్వాలు, మంత్రులు హామీలు ఇచ్చినప్పటికీ అవి అమలు కాక ప్రజలు అవస్థలు పడేవారు. 2004 ఎన్నికలకు ముందు అప్పటి ప్రతిపక్ష నాయకుడు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అండర్ బ్రిడ్జి నిర్మాణానికి హామీ ఇవ్వడమే కాక ముఖ్యమంత్రి అయ్యాక రూ.5కోట్లు నిధులు మంజూరు చేశారు. తర్వాత ఆయన మృతితో రైల్వే అండర్ బ్రిడ్జి ఫైల్ అటకెక్కి మూలనపడింది. తర్వాత అధికారంలోకి వచ్చినవారు ఆ ఫైల్‌ను పట్టించుకున్న పాపానపోలేదు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చర్యలతో కదిలిన ఫైల్

2019లో వైఎస్సార్సీపీ ప్రభుత్వం ఏర్పాటై వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక అప్పటి ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు కృషితో రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డి చొరవతో మూలనపడ్డ ఫైల్‌కు కదలిక వచ్చింది. పలుమార్లు రైల్వే ఉన్నత అధికారులతో చర్చించి కేంద్రం సహకారంతో రూ.72 కోట్లకు పైగా నిధులతో రైల్వే స్టేషన్ వద్ద డబుల్ వే అండర్ బ్రిడ్జితోపాటు నియోజకవర్గ వ్యాప్తంగా 9 అండర్ బ్రిడ్జిలను మంజూరు చేయించి 2023 నవంబర్ నెలలో ఎంపీ మిథున్ రెడ్డి, అప్పటి ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు చేతులమీదుగా పనులు ప్రారంభించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పనులు ప్రారంభించి వేగవంతం చేశారు. ఆ పనులు కొన్ని పూర్తయ్యి, కొన్ని తుది దశకు చేరుకోవడంతో పలువురు ప్రజలు గత ప్రభుత్వాన్ని గుర్తు చేసుకొని హర్షం వ్యక్తం చేస్తున్నారు.

తీరనున్న ప్రజలు, విద్యార్థుల ఇబ్బందులు

దశాబ్దాలుగా కోడూరు పట్టణంలో రైల్వే అండర్ బ్రిడ్జి లేక ప్రజలు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. రైల్వేగేటు వద్ద ఒక వైపు ప్రభుత్వ మార్కెట్ యార్డును నిర్మించగా అక్కడి వెళ్లేందుకు రోడ్డు మార్గం లేక ప్రస్తుతం శిథిలావస్థకు చేరుతోంది. అవతలి వైపు ప్రభుత్వ డిగ్రీ కళాశాల, జూనియర్ కళాశాల, హైస్కూల్ ఉన్నాయి. విద్యార్థులు రెండు కిలోమీటర్లు చుట్టూ తిరిగి వెళ్లలేక పట్టాలు దాటుకుంటూ విద్యాలయాలకు వెళుతున్నారు. గతంలో పలు రైల్వే ప్రమాదాలు జరిగాయి. పరీక్షల సమయంలో వీరు చాలా ఇబ్బందులు పడేవారు. రోగులను అత్యవసరంగా ఆస్పత్రులకు వెళ్లాలంటే సమయం వృథా అయ్యి ప్రాణాల మీదకు తెచ్చుకునేవారు. అయ్యవారిపల్లి, బుడుగుంటపల్లి, ఉర్లగడ్డపోడు, వీపీఆర్ కండ్రిక, తాడివాండ్లపల్లి, కన్నెగుంట ఎస్సీకాలనీ, ఆర్.రాచపల్లి, సమతా నగర్ ఇలా 45 గ్రామాలకుపైగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బ్రిడ్జి అందుబాటులోకి వస్తే వీరి ఇబ్బందులు తీరనున్నాయి.

ఆస్పత్రులకు వెళ్లాలంటే నరకయాతన



రైలు పట్టాల అవతల ఉన్న 40 గ్రామాల్లో ప్రజలు అనారోగ్యంతో ఆస్పత్రులకు వెళ్లాలంటే నరకయాతన పడుతుంటారు. సుమారు రెండు కిలోమీటర్లు చుట్టూ తిరిగి రైల్వేగేటు దాటి ఆస్పత్రులకు వెళ్లాలంటే రోగి ప్రయాణంలోనే తీవ్ర అస్వస్థతకు లోనవుతున్నాడు. ఈ అండర్ బ్రిడ్జి పనులు పూర్తయితే ప్రజలకు ఎంతో మేలు జరుగనుంది. ప్రమాదాలు కూడా తగ్గుతాయి.

– చంద్రశేఖర్, సర్పంచ్, బుడుగుంట పల్లి, రైల్వేకోడూరు

విద్యార్థులకు మేలు జరుగుతుంది



రైల్వే అండర్ బ్రిడ్జ్ నిర్మాణం పూర్తి కానుండడంతో విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుంది. రైల్వేగేటుకు అవతలి వైపు ప్రభుత్వ డిగ్రీ కళాశాల, జూనియర్ కళాశాల, హైస్కూల్, పలు హాస్టళ్లు ఉన్నాయి. విద్యార్థులు రెండు కిలోమీటర్లు తిరిగి వెళ్లలేక పట్టాలు దాటుకుంటూ చదువులకు వెళుతున్నారు. పరీక్షల సమయంలో వీరు చాలా ఇబ్బందులు పడుతున్నారు.

– దార్ల రాజశేఖర్, సీపీఐ నాయకుడు, రైల్వేకోడూరు

ఎంపీ, మాజీ ఎమ్మెల్యేల కృషి మరువలేనిది



దశాబ్దాలుగా కలగా ఉన్న పట్టణంలోని ఎల్84 అండర్ బ్రిడ్జిని ప్రత్యేక దృష్టి పెట్టి పనులు వేగవంతంగా చేయించేలా కృషి చేస్తున్నాం. నిర్మాణంలో ఉన్న అండర్ బ్రిడ్జిలు అన్నీ 3 నెలలో పూర్తయ్యి ప్రజలకు అందుబాటులోకి వస్తాయి. ఇప్పటికే కొన్ని ఆర్‌యూబీలు పూర్తయ్యాయి. వీటి మంజూరులో ఎంపీ పీవీ మిథున్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు కృషి మరువలేనిది.

– తల్లెం భరత్‌కుమార్‌రెడ్డి, డీఆర్‌యూసీసీ మెంబర్

రోడ్డు భద్రతా నియమాలు తప్పక పాటించాలి


ఆటో డ్రైవర్లకు సూచనలు చేస్తున్న ఎస్‌ఐ

గాలివీడు : రోడ్డుపై ఆటోలు నడిపేటప్పుడు రహదారి భద్రతా నియమాలను ఆటో డ్రైవర్లు, యజమానులు పాటించాలని ఎస్‌ఐ రామకృష్ణ సూచించారు. మండల కేంద్రంలోని పశువుల సంత ఆవరణలో ఆటో డ్రైవర్లు, యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు సేఫ్టీ గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని సూచించారు. ఆటో డ్రైవర్లకు యూనిఫామ్, లైసెన్స్ తప్పనిసరి అని చెప్పారు. ప్రతి వాహనానికి ఇన్సూరెన్స్ చేయించుకోవాలని ఆదేశించారు. ఎక్కువ మంది ప్రయాణికులతో ప్రయాణించవద్దని తెలియజేశారు. మద్యం సేవించి వాహనం నడపటం, మొబైల్ ఫోన్ వినియోగిస్తూ డ్రైవింగ్ చేయరాదన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు


కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

రాజంపేట రూరల్ : ఫ్యూచర్ మైండ్స్ స్కూల్‌లో శుక్రవారం కరస్పాండెంట్ వై.నందకిషోర్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహింపజేశారు. అరవింద్ నేత్ర హస్పిటల్ డాక్టర్ అరవింద్ 450 మంది విద్యార్థులకు 150 మంది తల్లిదండ్రులకు కంటి వైద్య పరీక్షలు చేశారు. కంటి చూపుతో ఇబ్బంది పడుతున్న 20 మంది విద్యార్థులకు మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఉచితంగా కంటి అద్దాలను అందించనున్నట్లు తెలియజేశారు.

పది పబ్లిక్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

- మండలంలో మూడు పరీక్షా కేంద్రాలు
- హాజరుకానున్న 540 మంది విద్యార్థులు


గాలివీడులోని జెడ్పీ ఉన్నత పాఠశాల

గాలివీడు : ఈ నెల 17వ తేదీ సోమవారం నుంచి పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు జరగనున్న నేపథ్యంలో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మండల విద్యాధికారి-1 చక్రేనాయక్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాలివీడు మండల కేంద్రంలో 3 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయగా, 540 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకనున్నట్లు తెలిపారు. జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 210 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానుండగా, చీఫ్ సూపరింటెండెంట్‌గా బి.సుబ్బారాయుడు, డిపార్టుమెంటల్ ఆఫీసర్‌గా జి.మనోహర్, అలాగే జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో 200 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానుండగా, చీఫ్ సూపరింటెండెంట్‌గా బి.దుర్గేశ్వర్ రాజు, డిపార్టుమెంటల్ ఆఫీసర్‌గా బి.రామాంజనేయులు వ్యవహరించనున్నారు. అలానే జిల్లా పరిషత్ ఉర్దూ హైస్కూల్‌లో 130 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానుండగా, చీఫ్ సూపరింటెండెంట్‌గా పి.చిన్నరెడ్డప్ప, డిపార్టుమెంటల్ ఆఫీసర్‌గా జాఫరుద్దీన్ విధులు నిర్వహించనున్నారు. ఇదిలా ఉండగా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలుతో పటిష్ట పోలీసు బందోబస్తు మధ్య ప్రశాంత వాతావరణంలో పరీక్షల నిర్వహణకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు అధికారులు స్పష్టం చేశారు.

కనుల పండువగా నారసింహుడి తిరునాల


ఓబులేసు కోన లక్ష్మీ నరసింహస్వామికి పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు

ఒంటిమిట్ట : మండల పరిధిలోని వెంకటాయపల్లి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి తిరునాల శుక్రవారం ఘనంగా జరిగింది. ఆలయంలోని లక్ష్మీనరసింహస్వామి మూలవిరాట్‌కు అభిషేకాలు, హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజ కైంకర్యాలు అనంతరం మండల టీడీపీ అధ్యక్షుడు గుజ్జుల నరసింహారెడ్డి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. రాత్రి 7 గంటలకు లక్ష్మీ సమేత నరసింహస్వామికి కనుల పండుగగా కల్యాణ వేడుకను జరిపారు. ఈ కల్యాణంలో ఉత్సవ మూర్తులను సుందరంగా అలంకరించి అర్చకులు కల్యాణ క్రతువును శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులను సినీ ఆర్కెస్ట్రా బృందం ఆలపించిన గీతాలు అలరించాయి.

రసవత్తరంగా బండలాగుడు పోటీలు

ఓబులేసుకోన లక్ష్మీనరసింహస్వామి తిరునాలలో భాగంగా మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభమైన బండలాగుడు పోటీలలో ఐదు జతల ఎడ్లు పాల్గొన్నాయి. ఈ పోటీల్లో ప్రొద్దుటూరు మండలం రంగసాయిపల్లెకు చెందిన మార్తల వెంకట సుబ్బారెడ్డి ఎడ్లు నిలిచి రూ.70 వేలు అందుకున్నారు. ద్వితీయ స్థానంలో ప్రకాశం జిల్లా, రాచర్ల మండలం పుల్లలచెరువుకు చెందిన బొర్ర రవితేజ ఎడ్లు నిలిచి రూ.50 వేలు, మూడో స్థానంలో ప్రకాశం జిల్లా, గడివేముల మండలం, పెసర వాయి గ్రామానికి చెందిన సయ్యద్ కలాం బాష ఎడ్లు విజేతగా నిలిచాయి. వీరికి రూ. 30 వేలు నగదును అందజేశారు. ఇక నాలుగు, ఐదు స్థానాల్లో నిలిచిన ఎడ్లకు ప్రోత్సాహ బహుమతి కింద రూ.12500లు నగదును అందజేశారు.

క్రీడలతో మానసిక, శారీరక దృఢత్వం


జ్యోతీ ప్రజ్వలన చేస్తున్న డీఆర్‌ఓ, ఏఎస్పీ, అధికారులు

రాయచోటి టౌన్ : ఆటల ద్వారా మానసిక, శారీరక దారుఢ్యం వస్తుందని జిల్లా రెవెన్యూ అధికారి మధుసూధన రావు అన్నారు. శుక్రవారం రాయచోటి పట్టణంలోని మాసాపేటలోని శ్రీ చైతన్య రెసిడెన్సియల్ పాఠశాలలో డాక్టర్ బీఎస్ రావు జ్ఞాపకార్థం ఆయన పేరున మెమోరియల్ జోనల్ స్పోర్ట్స్ మీట్ నిర్వహించారు. ఆయనతోపాటు రాయచోటి అడిషనల్ ఎస్పీ వెంకటాద్రి జ్యోతీ ప్రజ్వలన చేసి ఆటల పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఆర్‌ఓ మాట్లాడుతూ పాఠశాలలో విద్యతోపాటు ఆటలు కూడా నేర్పాలని సూచించారు. అప్పుడే వారిలో సృజనాత్మకత బయటకు వచ్చి వారిలో మానసికంగా, శారీరకంగా దృఢంగా తయారవుతారన్నారు. కార్యక్రమంలో శ్రీ చైతన్య డివిజనల్ ఏజీఎం డి.రమణయ్య, ప్రిన్సిపల్ కళాభారతి, సుధాకర్‌రెడ్డి, శివార్జున రెడ్డి, సుబ్బయ్య, సుబ్బోజి, నాగనరేంద్ర, రాధిక, కో-ఆర్డినేటర్ కుటుంబావు, వైస్ ప్రిన్సిపల్ జీవానందం, డీన్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందుల కారణంగా విద్య ఆగకూడదు

లక్కిరెడ్డిపల్లి : రోడ్డు ప్రమాదంలో మూడేళ్ల క్రితం తండ్రిని కోల్పోయిన విద్యార్థికి మనం ఎస్ఎస్‌సీ 1983 సేవాసంస్థ సభ్యులు ఆర్థికసాయం అందించారు. శుక్రవారం సంస్థ సభ్యులు రూ.50 వేలు విలువచేసే చెక్కును విద్యార్థి తల్లి సుగుణమ్మకు అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ సభ్యులు మాట్లాడుతూ పదవ తరగతి చదువుతున్న వెంకటచరణ్ ఫీజు చెల్లించేందుకు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాడన్న సమాచారంతో సంస్థ ఆధ్వర్యంలో ఆర్థికసాయం అందించామన్నారు. ఆర్థిక ఇబ్బందుల వల్ల ఏ ఒక్కరూ విద్యకు దూరం కాకుండా ఉండటమే తమ ఉద్దేశమన్నారు. సంస్థ ఫౌండర్ యోగాంజనేయ రెడ్డి, సభ్యులు పద్మావతి, బత్తిన దేవానందరెడ్డి, కాశీ విశ్వనాథ రెడ్డి, పి.వెంకటరామిరెడ్డి, ఎం.వెంకటరామిరెడ్డిలు పాల్గొన్నారు.

వైభవం.. గ్రామోత్సవం


గ్రామోత్సవంలో ఊరేగుతున్న విగ్రహాలు

నందలూరు : గొల్లపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన రామాలయంలో గ్రామస్తుల ఆధ్వర్యంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల్లో భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు. అనంతరం గ్రామంలో ప్రతిష్ట విగ్రహాలను డప్పు వాయిద్యాలు, బాణసంచా పేలుస్తూ అంగరంగ వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు.

మల్లూరమ్మ దయతో ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలి


చిన్నమండెం: కార్యకర్తలు ఇచ్చిన విందులో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి, దేవనాథరెడ్డిలు

చిన్నమండెం : మల్లూరమ్మ దయతో ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని వైఎస్‌ఆర్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి ఆకాంక్షించారు. శుక్రవారం మల్లూరమ్మ జాతర సందర్భంగా పలువురు వైఎస్‌ఆర్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఇచ్చిన విందులో జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ దేవనాథరెడ్డితో కలిసి శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు. వందాడి గ్రామం దిరివాండ్లపల్లెలో సర్పంచ్ ముసల్‌రెడ్డి, సీనియర్ నాయకులు రంగారెడ్డి, మల్లూరు గ్రామంలోని బెల్లంవాండ్లపల్లెలో వైఎస్‌ఆర్‌సీపీ నాయకులు బెల్లం బయారెడ్డి, ఆదర్శ రైతు బయారెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, సుబ్బారెడ్డి, రమణారెడ్డిలు ఇచ్చిన విందులో శ్రీకాంత్ రెడ్డి, దేవనాథరెడ్డిలు హాజరయ్యారు. కార్యక్రమంలో వైఎస్‌ఆర్‌సీపీ నాయకులు గోవర్దన్‌రెడ్డి, కంచంరెడ్డి, లక్కిరెడ్డిపల్లె ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్‌రెడ్డి, గాలివీడు వైస్ ఎంపీపీ మిట్టపల్లె యదుభూషణ్‌రెడ్డి, సర్పంచ్ ఉమాపతిరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ రమేష్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ దాసరి చిన్నరెడ్డి, జగన్నాథ రెడ్డి, మాజీ కౌన్సిలర్ ఆనందరెడ్డి, వెంకట్రామిరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, ఎంపీటీసీ రామచంద్రారెడ్డి, శివశంకరయాదవ్, రాజారెడ్డి, జయశంకర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, కృష్ణారెడ్డి, మండల జేసీఎస్ కన్వీనర్ చుక్కా అంజనప్ప, లోకేశ్వరరెడ్డి, రమణయ్య, రమణ, మాజీ ఎంపీటీసీ వెంకట్రామిరెడ్డి, ఎంపీటీసీ రమేష్, ఉపసర్పంచ్ రమణ, రమణారెడ్డి, రామాంజులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన వైద్యం అందించాలి

రాయచోటి జగదాంబసెంటర్ : రోగులకు నాణ్యమైన సేవలు అందించాలని వైఎస్‌ఆర్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. రాయచోటి పట్టణంలోని శేఖర్ కేఫ్ ఎదురుగా డా.రెడ్డి భాస్కర్ రెడ్డి, డా.ఏవీ సులోచనలు ఏర్పాటు చేసిన యశోద హాస్పిటల్ నూతన భవనం ప్రారంభం సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ ఆసుపత్రి నిర్వాహకులు ప్రజలకు విలువలతో కూడిన వైద్యం అందించాలన్నారు. జిల్లా కేంద్రం ఏర్పాటు తర్వాత రాయచోటిలో అధునాతన వైద్యసేవలు ఒక్కొక్కటిగా అందుబాటులోకి వస్తుండటం సంతోషదాయకమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాషా, వాల్మీకి సంఘం జిల్లా అధ్యక్షుడు గువ్వల బుజ్జిబాబు, గువ్వల జగన్ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

రాజంపేట రూరల్ : హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత మంచినీటి చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. స్థానిక డివిజనల్ ఫారెస్టు కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ఈ చలివేంద్రం ద్వారా పట్టణానికి వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజల దాహార్తి తీర్చుతుందని నిర్వాహకులు తెలియజేశారు. ప్రతి రోజు 400 మందికి మజ్జిగ అందించనున్నట్లు పేర్కొన్నారు.

నేడు వీరనాగమ్మ జాతర

వీరబల్లి : మండలంలోని గుర్రప్పగారిపల్లి పంచాయతీలో నేడు శనివారం మాదిరెడ్డిగారిపల్లి సమీపంలో వెలసిన వీరనాగమ్మ జాతర జరుగునని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఉదయం అమ్మవారి దగ్గర బిడ్డలు లేని స్త్రీలు వరపడటం జరుగుతుందన్నారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరుగుతాయన్నారు. అదేరోజు రాత్రి మొక్కుబడులు ఉన్న భక్తులు చాందినీ బండ్లు కట్టి గుడి చుట్టూ ప్రదక్షణ నిర్వహిస్తారన్నారు. ఆదివారం ఉదయం అమ్మవారికి ప్రత్యేకంగా బోనాలు పెట్టి మొక్కుబడులు తీర్చుకోనున్నారు. ఆలయ ధర్మకర్త శ్రీహరి నాయుడు ఆధ్వర్యంలో ఈ తిరునాల జరుగుతుందని తెలిపారు.

పెద్ద మసీదులో ఇఫ్తార్ విందు


ఇఫ్తార్ విందుకు హాజరైన ఎస్‌ఐ రవీంద్రబాబు

లక్కిరెడ్డిపల్లి : మండల కేంద్రంలోని పెద్ద మసీదులో శుక్రవారం సాయంత్రం ముస్లిం సోదరులకు ఎస్‌ఐ రవీంద్రబాబు ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ రవీంద్రబాబు మసీదులో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి ముస్లిం సోదరులతో కలిసి ఇఫ్తార్ విందును స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మతపెద్దలు, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ నివారణకు సహకరించాలి


జాతరలో క్యాంప్ ఏర్పాటు చేసిన వైద్య సిబ్బంది

చిన్నమండెం : ఎయిడ్స్ అంటువ్యాధి కాదని అంటించుకునే వ్యాధి అని పీసీఎస్ఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ జి.చెన్నారెడ్డి, మల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ రియాజ్‌లు తెలిపారు. మండలంలోని మల్లూరమ్మ జాతరలో ఏపీ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, డీఏపీసీయూ సూచనల మేరకు జాతర ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఎయిడ్స్ క్యాంప్‌ను వారు ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చి ఎయిడ్స్ నివారణ మార్గాలు సూచనలు తెలియజేస్తున్నట్లు వారు తెలిపారు. మల్లూరమ్మ జాతరలో నిర్వహించిన ఎయిడ్స్ క్యాంపునకు ప్రజల నుంచి అపూర్వ స్పందన లభించింది. కార్యక్రమంలో పవన్‌కుమార్, ఏఎన్ఎం నాగరాణి, ఓఆర్‌డబ్ల్యూలు చంద్రకళ, అంజనమ్మ, సుహాసిని, విజయలక్ష్మి, ఖాదర్‌వలీ, మల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకం

కడప కార్పొరేషన్ : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రాయచోటి అసెంబ్లీ నియోజకవర్గ అనుబంధ విభాగాలకు అధ్యక్షులు నియమించినట్లు ఆ పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. యువజన విభాగం అధ్యక్షుడిగా ఎం.రెడ్డికుమార్, మహిళా విభాగం అధ్యక్షురాలిగా ఎం.లక్ష్మిదేవమ్మ, రైతు విభాగం అధ్యక్షులుగా కేశవరెడ్డి, బీసీ సెల్ అధ్యక్షునిగా బి.నూర్ అహ్మద్, ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా ఎ.ఆంజనేయులు, ఎస్టీ సెల్ అధ్యక్షునిగా బి.వెంకట రమణ, మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా ఎం.ఎజాజ్ అలీఖాన్, విద్యార్థి విభాగం అధ్యక్షునిగా వి.మణికంఠారెడ్డి, మున్సిపల్ విభాగం అధ్యక్షునిగా ఎస్.ఈశ్వర్ ప్రసాద్, లీగల్ సెల్ అధ్యక్షునిగా వై.రమేష్ రెడ్డి, వైఎస్సార్ టీయూసీ అధ్యక్షునిగా ఆర్.అశోక్‌కుమార్, ఐటీ వింగ్ అధ్యక్షునిగా ఎస్‌కే మస్తాన్‌బాషా, వీవర్స్ విభాగం అధ్యక్షునిగా బి.శంకర్, గ్రీవెన్స్‌సెల్ అధ్యక్షునిగా జి.యోగానందబాబు, పంచాయతీరాజ్ వింగ్ అధ్యక్షునిగా ఎ.వెంకట రమణ, వలంటీర్స్ వింగ్ అధ్యక్షులుగా డి.సోమిరెడ్డి, దివ్యాంగుల విభాగం అధ్యక్షులుగా జి.బాలాజీ, వాణిజ్య విభాగం అధ్యక్షునిగా టి.ప్రసాద్, క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షునిగా ఎ.దొరబాబు, మేధావుల ఫోరం అధ్యక్షునిగా జె.రవీంద్రయాదవ్, సోషల్ మీడియా విభాగం అధ్యక్షులుగా ఆర్.వినోద్‌కుమార్‌నాయుడు, బూత్ కమిటీల విభాగం అధ్యక్షులుగా ఎస్.వెంకట సుబ్బారెడ్డి, ప్రచార విభాగం అధ్యక్షులుగా ఎస్.శివశంకర్‌లను నియమించారు.

పాలేటమ్మ జాతరను ప్రశాంతంగా జరుపుకోవాలి


మాట్లాడుతున్న డీఎస్పీ కొండయ్యనాయుడు

చిన్నమండెం : ఈ నెల 16, 17వ తేదీలలో జరిగే పాలేటమ్మ జాతరను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని రాయచోటి డీఎస్పీ కొండయ్య నాయుడు తెలిపారు. చిన్నమండెం మండలం కేశాపురం గ్రామంలో వెలసిన పాలేటమ్మ ఆలయం వద్ద డీఎస్పీ కొండయ్యనాయుడు, రాయచోటి రూరల్ సీఐ వరప్రసాద్, ఎస్‌ఐ సుధాకర్‌ల ఆధ్వర్యంలో పీస్ కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ జాతర సందర్భంగా ప్రత్యేక పోలీస్ టీంలను ఏర్పాటు చేశామని ఎలాంటి అవాంఛనీయ, అసాంఘిక సంఘటనలకు పాల్పడినా కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు.


గాలివీడు: హోలీ సంబరాల్లో యువత

ఉత్సాహంగా హోలీ సంబరాలు

గాలివీడు/నందలూరు : హోలీ సంబరాలు శుక్రవారం అంబరాన్నంటాయి. గాలివీడులోని పక్కీరారెడ్డిగారిపల్లె రామాలయం వద్ద యువకులు, చిన్నారులు కేరింతలు కొడుతూ రంగుల్లో మునిగి తేలారు. నందలూరులో రైల్వే కార్మికులు హోలీ సంబరాలు నిర్వహించుకున్నారు. పిల్లలు సైతం ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ హోలీ పండుగ జరుపుకున్నారు.


నందలూరు: రైల్వే కేంద్రంలో హోలీ సందడి